
# తప్పెవరిది?

కళ్యం సుబ్రహ్మణ్యశర్మ

"సోమశేఖరము పిచ్చివానివలె వీథివెంబడి పరుగెత్తుకొనిపోయెను."



చెన్నపురి మహానగరము. భారతదేశమునందు ప్రజాసంఖ్యనుబట్టి అది మూడవది. గొప్పధనికులు, విద్యావంతులు, రాజ్యాధికారులు అందు నివసించుచున్నారు. రాజధానియొక్క నలుమూలలనుండియు విద్యార్థులు వచ్చి యచ్చటి విశ్వవిద్యాలయమునందు చదువుకొనుచుందురు. వారు ఏలాటి సంసారబాధలు లేక స్వేచ్ఛావిహారులై సాధారణముగా దిరుగుచుందురు. ఒకనాటి సాయంకాలము చీకటి క్రమ్ముకొనుచున్నది. ముగ్గురాంధ్ర యువకులు నిలబడి యొకచిన్న వీథియందు గుసగుసలాడుకొనుచున్నారు వారిట్లు మాటలాడుకొనుచుండగా అపరిచితుడయిన ఒక బాటసారి వారిని కలిసికొనెను. వెంటనే అతడు "బాబూ మీదేవూరండి" యని స్వచ్ఛమయిన అరవ తెలుగు ఉచ్చారణతో పలుకరించెను. కనకరాజు రివ్వున తలద్రిప్పి 'ఎవరోయి నీవు' అని యడిగెను. దానికతడు "బాబూ, నేను మీలాటివారి సేవకుణ్ణి. మీకేదయిన సహాయము గావలసిన చేస్తాను" అని బదులు చెప్పెను.

రామసింగు సంగతి గ్రహించెను. ముగ్గురిలో నతడే విటశేఖరుడు. కనకరాజునకు భోగకాంతల చెలిమి యుండెడిదిగాని రామసింగుకంటె గాదు. చీట్లాటలో చెప్పినట్లు అతనిదే పైచేయి. సోమశేఖరమో, ఏమి తెలియనివాడు. ముగ్గురును ఒకే యూరివారు గనుక చేరియుల్లాసముతో బయలుదేరినారు. మార్గమధ్యమున రామసింగు సానియింటికి వెళ్లవలెనని ప్రారంభించెను. కనకరాజు 'తథాస్తు' అని వెంటనే సమ్మతించెను. సోమశేఖరమునకు దిక్కుతోచలేదు. అతడదివరకు భోగవాసము నెరిగినవాడు కాడు. అచ్చటికి వెళ్లుట అతనికిష్టము లేదు. అయితే రానినిన తన స్నేహితులు ఎగతాళి చేయుదురను భయము. ఇట్టి దుస్థితిలో జిక్కి యతడవస్థపడుచుండగా, రామసింగు బేరమును కుదిరించెను. తాంబూలమునకని యొక రూపాయను కూడ నతడు ఇచ్చెను. భోజనాదికము చేసి మరల వత్తుమని తన మిత్రులపరముగా నతడు వాగ్దానము చేసెను.

